క్లుప్తంగా

విద్యార్థులకు పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వి.కోట: విద్యార్థులు పుస్తక పఠనం అలవరచుకుంటే అదే జీవితంలో విజేతలుగా నిలుపుతుందని గ్రంథాలయాధికారి మొహ్మద్ వహాబ్ అన్నారు. సోమవారం 57 జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆయన పట్టణంలోని బాలుర, బాలికోన్నత, ఉర్దూ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, రంగుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.నిత్యం గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదవడంతో కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలమనేరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ హేమంత్‌కుమార్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పుష్కరిణిలో పూడికతీత

పుంగనూరు: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి పుష్కరిణిలో ఈనెల 25న కార్తీక దీపోత్సవం నిర్వహించేందుకుగాను ఏర్పాట్లకు ఉపక్రమించారు. సోమవారం హిందూ జాగరణ సమితి సభ్యులు పుష్కరిణిలోని పూడికను తొలగించి, బురదనీటిని మోటార్లతో తొలగించారు. కార్తీక మాసం 4వ సోమవారం ఆనవాయితీ ప్రకారం దీపోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. హిందువులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విశ్రాంత టీచర్ శ్రీనాథరెడ్డి మృతి


శ్రీనాథరెడ్డి(ఫైల్)

చౌడేపల్లె: విశ్రాంత ఉపాధ్యాయుడు, చారాల పంచాయతీ ఓదులపేటకు చెందిన శ్రీనాథరెడ్డి(65) సోమవారం హఠాన్మరణం చెందారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి, సమాజ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే ఆయన మృతి బాధాకరమని పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన భౌతిక కాయానికి ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు నివాళులర్పించారు.

తహసీల్దార్‌కు సన్మానం

సదుం: తహసీల్దార్ ఎస్ఎం హుస్సేన్‌ను కార్యాలయ సిబ్బంది సోమవారం సన్మానించారు. ఇటీవల ఆయన రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో డీటీ కుమార్, సర్వేయర్, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

అంబలం పూజ



బైరెడ్డిపల్లె: మండలంలోని గంగినాయనపల్లెలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి అంబలం పూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అరటి బోదెలతో తయారు చేసిన మండపంలో శ్రీ వినాయక, సుబ్రమణ్యం, అయ్యప్ప స్వాముల చిత్రపటాలను కొలువుదీర్చారు. విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అయ్యప్ప మాల ధరించి ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు పూజ చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

పుంగనూరు: ఓ మహిళ అదృశ్యం కేసులో పోలీసులు పిలిపించిన వ్యక్తి సోమవారం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల ద్వారా ఇది వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. పుంగనూరు మండలంలోని బోడేవారిపల్లెకు చెందిన పల్లా దేవేంద్ర(34) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం పుంగనూరులో ఓ వివాహితను ఆమె సన్నిహితుడు చిరంజీవి తీసుకెళ్లాడు. ఆ సమయంలో పల్లా దేవేంద్ర కారులో వారిద్దరినీ తీసుకెళ్లినట్లు పోలీసులకు మహిళ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న చిరంజీవితోపాటు అతనికి సహకరించిన పల్లా దేవేంద్ర తదితరులను పోలీసులు ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. సీఐ అందుబాటులో లేకపోవడంతో సోమవారం రావాలని పోలీసులు చెప్పి పంపారు. కానీ పల్లా దేవేంద్ర రాకుండా చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడాన్ని గ్రామస్తులు కనుగొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయమై సీఐ శ్రీనివాసులును వివరణ కోరగా ఆదివారం పలమనేరుకు వెళ్లిన కారణంగా విచారణ నిమిత్తం అందరినీ రమ్మని చెప్పామన్నారు. పల్లా దేవేంద్ర కారులో ఆమెను, ఆమె సన్నిహితుడైన చిరంజీవిని తీసుకెళ్లాడని తెలిపారు. అతను రాకుండా ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు ఎలాంటి వేధింపులకు గురి చేయలేదని పేర్కొన్నారు.

యానాదుల జీవితాల్లో వెలుగు

- నెట్టిబండకు కదిలిన అధికార యంత్రాంగం
- 40మంది ఆధార్, బర్త్ సర్టిఫికెట్ల జారీకి చర్యలు
- తాగునీటి సమస్య పరిష్కారం, వీధి దీపాల ఏర్పాటు
- రెండు రోజుల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామన్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..


చౌడేపల్లెలో నెట్టిబండకు ప్రత్యేక పైపులైను ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్న అధికారులు


ఎదుగు లేని బతుకు!

ప్రచురితమైన సాక్షి కథనం

చౌడేపల్లె: మండల స్థాయి అధికార యంత్రాంగం దిగువపల్లె పంచాయతీ నెట్టిబండకు కదిలింది. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న ఈ గ్రామంలో వివిధ సమస్యలపై దృష్టి సారించింది. వాటి పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన కార్యాచరణకు ఉపక్రమించింది. యానాదుల సమస్యలపై సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన »ఎదుగులేని బతుకు« శీర్షికతో ప్రచురించిన కథనంపై జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ స్పందించారు. ఆయన ఆదేశాలతో ఎంపీడీఓ లీలామాధవి, ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భుజంగం, రెవెన్యూ, వెలుగు, ఐసీడీఎస్ శాఖ, వైద్యశాఖ, సచివాలయ సిబ్బంది నెట్టిబండను పరిశీలించారు. కొన్ని ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలకు పరిష్కారం చూపేందుకు అధికారులు చొరవ చూపారు. యానాదుల స్థితిగతులను పరిశీలించిన అధికారులు చలించిపోయారు. పథకాల లబ్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారుల బృందం చర్చించింది. తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకుకు నీరు వెళ్లేలా ప్రత్యేక పైపులైను ఏర్పాటుచేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. శాశ్వత నీటి పరిష్కారం కోసం ప్రత్యేక బోరు మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు లేని 40 మందిని గుర్తించారు. వారందరినీ రెండురోజుల్లోపు ఆధార్ కేంద్రానికి ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లి కార్డులు తీయించాలని పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్‌ను ఆదేశించారు. బడి ఈడు పిల్లలందరూ స్కూళ్లకు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని ఎంఈఓ తెలిపారు. బర్త్ సర్టిఫికెట్లు లేని వారికి తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించి చర్యలు తీసుకుంటామని, కార్డులొచ్చాక అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలుఅందేలా చర్యలు తీసుకొంటామని ఎంపీడీఓ ప్రకటించారు. అలాగే ఇళ్లు, పింఛన్లు మంజూరు చేస్తామన్నారు.



బడి ఈడు పిల్లల వివరాల సేకరిస్తున్న ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ తదితరులు, యానాదులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

ఉత్తమ హెచ్‌ఎంకు సత్కారం


శ్రీధర్‌బాబుని సత్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

గంగవరం: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మేలుమాయి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీధర్‌బాబును పలమనేరు డివిజన్ ఎస్టీయూ నాయకులు ఘనంగా సత్కరించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్ మాట్లాడారు. శ్రీధర్‌బాబు సేవలను ప్రస్తుతించారు. ఆయన ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడం మండలానికే గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మోహన్‌యాదవ్, ఎంఈఓ-2 శ్రీనివాసులు, హెచ్ఎం రూపాదేవి, ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీపీకి మాతృ వియోగం


చెంగమ్మ (ఫైల్)

రొంపిచెర్ల: ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి తల్లి చెంగమ్మ(95) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందారు. ఆమె భౌతిక కాయానికి జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి, సలీంబాషా, డాక్టర్ శ్రీనాథ్, కోటా వెంకటరమణ, విజయశేఖర్‌బాబు, శ్రీనాధనాయుడు, మహబూబ్‌బాషా, కాలేషా, ఖలీల్, ఉమాపతి రెడ్డి తదితరులతోపాటు టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు ఎంపీపీ చెప్పారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం


రొంపిచెర్ల: ఓంకారేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతమాచరిస్తున్న భక్తులు

రొంపిచెర్ల: వరలక్ష్మీ వ్రతం పండుగను కట్టకింద శివాలయం, పెద్దగొట్టిగల్లులోని ఓంకారేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం భక్తులు ఆలయ పూజలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు చేశారు. శ్రావణ మాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారంతో మొదలు పెట్టి ఐదు వారాలు పండుగను జరుపుకుంటారు. వరాలు ఇచ్చే దేవతగా వరలక్ష్మీదేవిని కొలుస్తారు. ఈ దేవతను పూజిస్తే అష్టైశ్వర్యాలు కలుగుతాతయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఆలయంలో వసతులను కల్పించారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండల ప్రజలు కేదారేశ్వరీస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం, చిట్రెడ్డిపల్లె రామాలయంలో మహిళలు వేదపండితులు రాజశేఖర దీక్షితులు, ఆనందాచార్యుల ఆధ్వర్యంలో వ్రతపూజలు చేశారు. అలాగే శివాలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేక పూజలు చేశారు. ధ్వజ స్తంభం ఎదుట దీపారాధన చేశారు.


చౌడేపల్లె: చిట్రెడ్డిపల్లెలో..

సదుంలో..

సదుం: మండల కేంద్రంలోని మరకతేశ్వరస్వామి, అరుణాచలేశ్వర స్వామి, వీరభద్రస్వామి, మత్తుకువారిపల్లె మల్లీశ్వర స్వామి, జంగంపల్లె కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాలలో పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు సామూహిక కేదారేశ్వరస్వామి వ్రతమాచరించారు. వ్రత మహత్యాన్ని అర్చకులు తెలియజేశారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

కుప్పం: సమస్యలపై తమ దృష్టికి వచ్చే ఫిర్యాదులను అప్పటికప్పుడే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. సోమవారం మండలం పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదిక నిర్వహించారు. సమస్యలపై మొత్తం 29 ఫిర్యాదులు అందాయన్నారు. వీటిలో రిజిస్ట్రేషన్ శాఖ 6, రెవెన్యూ శాఖ 6 చొప్పున ఫిర్యాదులు ఉన్నట్టు చెప్పారు.

కవి సమ్మేళనం


కవులను సన్మానిస్తున్న దృశ్యం

పుంగనూరు: పట్టణంలోని గ్రంథాలయంలో సోమవారం కవి సమ్మేళనాన్ని అధికారులు తులసి నాయక్, నసీబ్‌జాన్ నిర్వహించారు. వివిధ సామాజిక అంశాలపై కవులు తమ కవితలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత పండితులు వెంకటపతి, హరి మొదలియార్, సీతాపతిరాజు, ద్వారకమ్మ, గంగులమ్మ, ఉర్దూ హైస్కూల్ హెచ్ఎం నబీవుల్లాఖాన్‌ను సన్మానించారు.కవయిత్రులు హసీనా, రహత్‌జాన్, శ్రీనివాసులు, పద్మావతమ్మ, సలీం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదాయానికి కొక్కొరొకో!

- ఎంత బరువైనా నరే రూ.600కే కోడి!
- పీహెచ్‌డీ చేసినా వ్యవసాయంపై ఆసక్తి
- కోళ్లకు ఎగబడుతున్న జనం
- నికర ఆదాయం కళ్లజూస్తున్న పెంపకందారుడు


15 రోజుల కోళ్ల పెంపకానికి వేసిన గూళ్లు

కుప్పంరూరల్: తమిళనాడు నుంచి కుప్పం వచ్చి స్థిరపడ్డ ఓ వ్యక్తి నాటుకోళ్ల పెంపకంతో అధిక ఆదాయం గడిస్తున్నాడు. బరువుతో సంబంధం లేకుండా కోడి రూ.600కు విక్రయిస్తుండడంతో కొనేందుకు మాంసంప్రియులు ఎగబడుతున్నారు. శనివారం తప్ప మిగిలిన అన్ని రోజుల్లో కోళ్ల కోసం వస్తున్నారు.

పెంపకంతో అధిక లాభాలు

తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ఇక్బాల్ సేఫ్టీ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ చేశారు. ఉద్యోగ రీత్యా ఆస్ట్రేలియా, మలేషియా దేశాలు తిరిగి ఇక్బాల్ చివరగా వ్యవసాయం చేస్తూ శేషజీవితం గడపాలనుకున్నాడు. స్నేహితుల ద్వారా కుప్పం మండలం, గుడ్లనాయనపల్లె గ్రామం వద్ద 10 ఎకరాల స్థలం ఉన్నట్లు తెలుసుకున్నాడు. ఇదే తడవుగా 2011లో అక్కడికి వెళ్లి స్థలం కొని వ్యవసాయంలో రంగప్రవేశం చేశాడు. అలాగే నాటు కోళ్ల పెంపకానికి షెడ్లు వేసుకుని కోళ్ల పెంచుతున్నాడు. కోయంబత్తూరు నుంచి వాటిని తెచ్చి ఇక్కడ పెంపకం చేపడుతున్నాడు. ఇక్కడే పుంజులు తెప్పించుకుని కోళ్లను క్రాసింగ్ చేస్తున్నారు. ఫామ్‌లో పెట్టిన గుడ్లను పొదిగించి నాటు కోళ్లను మూడు దశల్లో పెంచుతున్నారు. మొదటి దశలో గుడ్ల పొదిగింపు, పొదిగిన గుడ్లను మరో షెడ్డులోకి తరలించి 15 రోజులు ఉంచుతారు. తరువాత అక్కడి నుంచి తోటలో ప్రత్యేక ఏర్పాటు చేసిన షెడ్లకు తరలిస్తారు. నెల తరువాత బయటికి విడిచి పెడతారు. మూడు, నాలుగు నెలల తరువాత కోళ్లను అమ్మకానికి పెడుతున్నారు.

కోడి రూ.600..

బరువుతో సంబంధం లేకుండా ఇక్బాల్ కోడి రూ.600కు విక్రయిస్తున్నారు. కిలోన్నర నుంచి రెండు కిలోలు కోడి బరువు తూగుతుండడంతో గ్రామీణులు వేలకు వేలు ఇచ్చి మాంసం కొనలేక నాటుకోళ్ల వైపు మక్కువ చూపుతున్నారు. దీంతో ఇక్బాల్‌కు శనివారం తప్ప మిగిలిన రోజుల్లో మంచి గిరాకీ ఉంటోంది. ఇక్కడ ప్రకృతి వాతావరణలో కోళ్లు పెరుగుతుండడంతో రుచికరంగా ఉంటోందని స్థానికులు లొట్టలేసుకుని చెబుతున్నారు.

> **నాటుకోళ్ల ఆరోగ్యానికి మేలు**
>
> గొర్రెలు, మేకల మాంసం తినడం ద్వారా కొవ్వు శాతం పెరిగి రోగాల బారిన పడుతున్నారు. నాటు కోళ్ల తింటే ఆరోగ్యం తప్ప, ఎలాంటి సమస్యలు ఉండవు. గ్రామీణ ప్రజలు ఎక్కువగా ఉండడంతో కోళ్లను తూకం వేయకుండా రూ.600కు అమ్ముతున్నా. ఇది వరకు రూ.500కే ఇచ్చే వాళ్లం. డిమాండ్ పెరగడంతో వంద పెంచాం. ప్రతినెలా వందలాది కోళ్ల అమ్మకాలు సాగిస్తున్నాం. నెలవారి నికర ఆదాయం వస్తోంది.
>
> –ఇక్బాల్ , రైతు, గుడ్లనాయనపల్లె


ఆరు బయట పెరుగుతున్న నాటుకోళ్లు


కోళ్ల కోసం వేసిన షెడ్లు

ఇళ్ల స్థలాల కోసం ఆందోళన

పుంగనూరు: రాష్ట్రంలోని పేదలందరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం 1వ వార్డు సచివాలయం ఎదుట సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. కార్యదర్శి రామ్మూర్తి మాట్లాడుతూ, సీపీఐ, బీకేఎంయూ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. రాజకీయాలకతీతంగా పేదలందరికీ స్థలాలు మంజూరు చేసి, పక్కా గృహాలు నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. రత్నమ్మ పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ పరీక్షలపై అవగాహన

పులిచెర్ల(కల్లూరు): ఆంధ్రప్రదేశ్ భారతీయ విజ్ఞాన మండలి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతి చదివే విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించి నేర్చుకోవడానికి, పోటీ పడేందుకు కౌశిక్ పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నట్లు సమన్వయకర్త వెంకటసిద్ధులు తెలిపారు. ఆన్‌లైన్‌లో సైన్స్‌పై పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో టాలెంట్ పరీక్షలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు స్నేహ మాలిని, రాజేంద్ర, సైదుల్లా, హనీఫ్, వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.


కౌశల్ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సమన్వయకర్త

భక్తాగ్రేసరుడు కనకదాసు




పలమనేరు: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో, బైరెడ్డిపల్లె: చెక్‌పోస్టు కూడలిలో, వి.కోట: కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: కనకదాసు చిన్న వయస్సులోనే నరసింహ స్తోత్రం, రామధ్యాయ మంత్రం, మోహన తరంగిణి రాసిన గొప్ప కృష్ణ భక్తుడని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కీర్తించారు. సోమవారం కవి శ్రీ భక్త కనకదాసు జయంతి పురస్కరించుని పట్టణంలోని కనకదాసు విగ్రహం వద్ద ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. కనకదాసు అందరికీ అర్థమయ్యేలా కన్నడ భాషలో రచనలు చేస్తూ, కీర్తనలు రాస్తూ, వేదాంతాన్ని ఔపోసన పట్టి గొప్ప కృష్ణ భక్తుడయ్యారన్నారు. తన సైనిక వృత్తిని వీడి, తత్వజ్ఞానాన్ని పామరులకు అర్థమయ్యేలా సంగీత సాహిత్యాలతో కూర్చి అందించేందుకు తన జీవితాని అంకితం చేసిన భక్త పుంగవుడని స్మరించారు. కార్యక్రమంలో కురుబ సంఘం మండల నాయకులు బాలు, బాలరాం, మణి, శుభాష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె చెక్‌పోస్టు కూడలిలో సోమవారం 537వ శ్రీ కనకదాసు జయంతి వేడుకలను కురుబ కులస్తులు ఘనంగా నిర్వహించారు. కనకదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర కురుబ సంఘం గౌరవాధ్యక్షుడు నాగభూషణం, బైరెడ్డిపల్లె శాఖ అధ్యక్షుడు శివకుమార్, జనార్ధన్, శంకరప్ప, గౌరప్ప, సుబ్రమణ్యం, శివశంకర్, శేషేగౌడు, శ్రీనివాసులు, విశ్వనాథ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు

పలమనేరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండలంలోని కురుబ కులస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి కనకదాసు జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. కనకదాస చేసిన సేవలను పలువురు వక్తలు తమ ప్రసంగాల్లో ప్రస్తుతించారు. కురబ కుల సంఘ నేతలు పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పం: కురుబ కులస్తులు ఆరాధ్య దైవమైన కనకదాసు జయంతిని కుప్పంలో వాల్మీకి కులస్తులు ఘనంగా నిర్వహించారు. సోమవారం పీఈఎస్ మెడికల్ కళాశాల వద్ద కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కడా పీడీ మాట్లాడుతూ, కురుబ కులస్తులే కాకుండా ప్రతి ఒక్కరూ కనకదాస గురించి తెలుసుకోవాలన్నారు. సామాజిక వర్గాలతో సంబంధం లేకుండా మహోన్నత వ్యక్తులను గుర్తు చేసుకోవడం ప్రతి ఒక్కరి ధర్మంగా భావించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, కురుబ కుల సంఘ నాయకులు రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.